క్లుప్తంగా

కమలాపూర్‌లో మోస్తరు వర్షం

కమలాపూర్ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మండల వ్యాప్తంగా సోమవారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. ఇప్పటి వరకు ఇంకా వరి కోతలు పూర్తి కాకపోగా, కోసిన వరి ధాన్యం కల్లాల్లో, కొనుగోలు కేంద్రాల్లోనే ఉన్నాయి. అకాల వర్షం కారణంగా తాము ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు ఎక్కడ తడిసిపోతాయోనని తీవ్ర ఆందోళనకు గురైన రైతులు.. ధాన్యంపై టార్పాలిన్లు కప్పి తడువకుండా జాగ్రత్త పడ్డారు.

కారు, బైక్ ఢీ

నడికూడ : కారు, బైక్ ఢీ కొని వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని ధర్మారం వద్ద సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన గోనెల కుమార్ ఎక్సెల్ బైక్‌పై ధర్మారం నుంచి నడికూడకు వస్తున్నాడు. ఈ క్రమంలో ధర్మారం బస్‌స్టాప్ వద్ద ఎదురుగా వచ్చిన కారు ఢీ కొనడంతో గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం పరకాలలోకి ఓ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

పరామర్శ

ఆత్మకూరు : మండలంలోని అక్కంపేటలో ఇటీవల వివిధ కారణాలతో మృతిచెందిన కుటుంబాలకు కాంగ్రెస్ యువసేన నాయకుడు అల్లం బాలకిశోర్‌రెడ్డి ఆర్థికసాయం అందించారు. మాదాసి రమేశ్, సామల మొగిళి కుటుంబాలకు రూ.5వేల చొప్పున ఆర్థిక సాయం పంపించగా అల్లం మర్రెడ్డి బాధిత కుటుంబాలకు అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాదాసి రాంబాబు, మాజీ వైస్ ఎంపీపీ సాంబయ్య, మాజీ సర్పంచ్ మాదాసి కుమారస్వామి, గ్రామ పార్టీ అధ్యక్షుడు కృష్ణంరాజు, అనిల్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

నాగయ్యపల్లిలో అనారోగ్యంతో మృతిచెందిన గుండాల బయ్యన్న కుటుంబాన్ని అసైన్డ్ భూమి సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ,న్యాయవాది కలకోటి మహేందర్ సోమవారం పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులకు రూ.4వేల ఆర్థికసాయం అందించారు. డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సురేష్ పాల్గొన్నారు.

దామెరలో..

దామెర : మండలంలోని ఒగ్లాపూర్‌కు చెందిన రెడ్డి సంఘం సీనియర్ నాయకుడు మన్నెం రాంరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా గ్రామానికి చెందిన రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు సోమవారం రాంరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పలకల శ్రీనివాస్‌రెడ్డి, సాంబశివరెడ్డి, మన్నెం ఇంద్రారెడ్డి, వెంకటరెడ్డి, రమణారెడ్డి, రఘుపతిరెడ్డి, జైపాల్‌రెడ్డి, అనంతరెడ్డి, రాజిరెడ్డి, రాంరెడ్డి, సాంబరెడ్డి, సుధాకర్‌రెడ్డి ఉన్నారు.

గేదెను అపహరించిన ఇద్దరి అరెస్ట్



కమలాపూర్ : గేదెను అపహరించిన ఇద్దరిపై కేసు నమోదు అయ్యింది. పరకాలకు చెందిన మహమ్మద్ అనీఫ్, గడ్డం ప్రణయ్‌కాంత్ అనే ఇద్దరు నిందితులను సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గతనెల 29వ తేదీన మండలంలోని శనిగారంకు చెందిన చెరిపెల్లి రాజేందర్‌కు చెందిన రూ.80 వేల విలువచేసే గేదెను గుర్తుతెలియని దుండగులు అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. పరకాలకు చెందిన మహమ్మద్ అనీఫ్, గడ్డం ప్రణయ్‌కాంత్ అనే ఇద్దరు కలిసి గేదెను అపహరించినట్లు గుర్తించి నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

సీఎం కప్ పోటీలను జయప్రదం చేయాలి

వేలేరు : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న సీఎం కప్ పోటీలను అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ జయప్రదం చేయాలని తహసీల్దార్ హెచ్.కోమి పిలుపునిచ్చారు. సోమవారం ఎంఈఓ చంద్రమౌళి అధ్యక్షతన సీఎం కప్ నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులు, హెచ్‌ఎంలు, పీఈటీలతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో విద్యార్థుల ప్రతిభను వెలికితీసి మండల, జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో ఎంపిక చేసేందుకు ఈ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రీడాకారుల్లో దాగివున్న ప్రతిభను వెలికితీసేందుకు సీఎం కప్ మంచి అవకాశమని అన్నారు. గ్రామస్థాయిలో ఈనెల 7,8 తేదీల్లో, మండలస్థాయిలో 10,11,12 తేదీల్లో వివిధ విభాగాల్లో క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎస్సై సురేష్, ఎంపీఓ విమల, ఎస్‌జీఎఫ్ మండల సెక్రటరి రాజేశ్వరి, హెచ్‌ఎంలు రాజన్న, శ్రీదేవి, గురుకుల ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్, ఎస్‌ఓ ప్రవంతి తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడి సమస్యలు అక్కడే

- అధ్వానంగా పెద్దాపూర్ రోడ్డు
- హైస్కూల్‌కు ప్రహరీ లేక ఇబ్బందులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



పెద్దాపూర్‌లో గుంతలమయంగా మారిన రోడ్డు

ఆత్మకూరు : మండలంలోని పెద్దాపూర్ సమస్యలతో సతమతమవుతోంది. గ్రామంలో ఎన్నో ఏళ్ల క్రితం వేసిన రోడ్లు అధ్వానంగా మారాయి. అడుగడుగునా గుంతలు ఏర్పడడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళ వాహన చోదకులు రోడ్డు పరిస్థితిని గమనించకపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. గ్రామం మధ్యలో పూర్తిస్థాయిలో రోడ్డు వేయాలని స్థానికులు పలుమార్లు అధికారులను కోరుతున్నప్పటికీ పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అలాగే గ్రామంలో వివిధ వాడల్లో కూడా అంతర్గత రోడ్లు ప్రమాదకరంగా ఉన్నాయని, వాటిని కూడా పరిశీలించి కొత్త రోడ్లు వేయాలని స్థానికులు కోరుతున్నారు. పాలకులు, అధికారులు ఈ దిశలో కృషి చేయాల్సిన అవసరం ఉందని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రహరీ లేక ఇబ్బందులు...

పెద్దాపూర్ జెడ్పీ హైస్కూల్ ప్రహరీని రోడ్డు వేసే క్రమంలో తొలగించారని, అప్పటి నుంచి విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో పాఠశాల ఆవరణ అపరిశుభ్రంగా తయారవుతుందని అంటున్నారు. పాఠశాల పనివేళలు ముగిసిన అనంతరం, సెలవుల్లో పాఠశాలలో కొందరు ఆకతాయిలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని స్థానికంగా చర్చ జరుగుతోంది. పాఠశాలలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థుల సంఖ్య తగ్గుముఖం పడుతున్నట్లు తెలిసింది. హైస్కూల్‌లో 6 నుంచి 10వ తరగతి వరకు ఉండగా కేవలం 42మంది విద్యార్థులు ఉన్నారని, ఇప్పటికైనా పాఠశాలలో కనీస వసలు కల్పించాలని కోరుతున్నారు. సమస్యల పరిష్కారానికి పాలకులు కృషి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



ప్రహరీ లేని ప్రభుత్వ పాఠశాల

మూఢనమ్మకాలను విశ్వసించొద్దు



వేలేరు : కళాజాతాలో మాట్లాడుతున్న ఎస్సై

వేలేరు : గ్రామాల్లో మూఢనమ్మకాలను విశ్వసించొద్దని ఎస్సై సురేష్ కోరారు. మండలంలోని పీచర శివారు వేములపల్లి గ్రామంలో మూఢనమ్మకాలపై జాగృతి పోలీస్ కళాబృందం కళాజాతా నిర్వహించింది. ఈ సందర్భంగా ప్రజలకు మూఢనమ్మకాలపై మ్యాజిక్‌షో, కొత్త చట్టాలపై అవగాహన, రోడ్డు ప్రమాదాల నివారణ, బాల్య వివాహాలు, డయల్ 100, సైబర్ క్రైమ్స్, 1930 సైబర్ హెల్ప్‌లైన్ నంబర్, సీసీ కెమెరాల ఏర్పాటు, వృద్ధ తల్లిదండ్రులను చూసుకోవాల్సిన బాధ్యతపై కళాజాత నిర్వహించి అవగాహన కల్పించారు. అలాగే గంజాయి, గుట్కా, మత్తుపదార్థాల బారిన పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని నాటిక ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సై అజ్మీర సురేష్, కళాబృందం ఇన్‌చార్జ్, ఏఎస్సై నాగమణి, సభ్యులు విలియం, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, నారాయణ, విక్రమ్ రాజు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



కమలాపూర్‌లో..

సంక్షేమ పథకాల అమలుపై కళాజాతా

కమలాపూర్ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలపై తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు సోమవారం కళాజాతా నిర్వహించారు. కమలాపూర్, శనిగరం, లక్ష్మీపూర్ గ్రామాల్లో కళాజాతా ప్రదర్శన ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు రుణమాఫీ, రూ.500 వంటగ్యాస్, 50 వేల ఉద్యోగాలు తదితర సంక్షేమ పథకాలపై కళాకారులు ఆటపాటల ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో కళాకారుల టీం లీడర్ జీడి సుధాకర్, కళాకారులు శనిగరం బాబ్జీ, పుల్ల వెంకన్న, ఎండీ.రహీం, ముష్టం యోగానంద్, వేల్పుల విజేందర్, అంతడుపుల శారద, అంబాల జయ, బొంకూరి రాణి, వీరబోయిన ప్రియాంక, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యానవన పంటలపై దృష్టిసారించాలి

- డీఆర్డీఓ శ్రీను

దామెర : రైతులు ఉద్యానవన పంటల సాగుపై దృష్టిసారించాలని డీఆర్డీఓ మేన శ్రీను అన్నారు. మండలంలోని సీతారాంపూర్‌కు చెందిన ఉత్తమ ఆదర్శ రైతు ఎండీ. రంజాన్ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా డ్రాగన్ ఫ్రూట్స్‌ను సాగుచేస్తున్నాడు. కాగా రైతు డీఆర్డీఓను సోమవారం కలిసి తాను సాగుచేస్తున్న డ్రాగన్ ఫ్రూట్స్‌ను అందించాడు. పెట్టుబడి, సాగుచేసే విధానం, మార్కెటింగ్ విధానం, రాబడి, అధికారుల సహకారం వంటి వివరాల గురించి ఆయన రైతును అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఆర్డీఓ మాట్లాడుతూ.. జాతీయ ఉపాధి హామీ పథకాన్ని రైతులు వినియోగించుకోవాలని సూచించారు. ఉద్యానవన పంటల సాగుతో రైతులు అధిక లాభాలు పొందాలని ఆకాంక్షించారు. వినూత్న ఆలోచనలతో వివిధ పంటలను సాగుచేస్తున్న రైతును ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఏపీఓ శారద, అదనపు పీడీ అభినందించారు.



డీఆర్డీఓకు డ్రాగన్ ఫ్రూట్‌ను అందజేస్తున్న రైతు రంజాన్

పేదలకు అండగా ఎర్రజెండా



మాట్లాడుతున్న చక్రపాణి

ఐనవోలు : పేదల సమస్యలు పరిష్కరించేందుకు సీపీఎం అండగా ఉంటుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి స్పష్టం చేశారు. సోమవారం సీపీఎం మండల మూడో మహాసభ వెంకటాపూర్ గ్రామంలో నారాయణరెడ్డి, దర్శనాల సంపత్ అధ్యక్షతన జరిగింది. మండల కార్యదర్శి కాడబోయిన లింగయ్య నివేదికను ప్రవేశపెట్టగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అనేక హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా విజయోత్సవ సంబురాలు జరుపుకోవడం సరికాదన్నారు. ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ సీపీఎం పోరాటాలు చేపడుతుందన్నారు. అలాగే మతతత్వ విధానాలను పెంచిపోషిస్తున్న కేంద్ర ప్రభుత్వంపై పోరాటం చేస్తామన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సారంపల్లి వాసుదేవరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఉప్పలయ్య, రాంకుమార్, నాగరాజు, మహేందర్ పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

ఐనవోలు : ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఎంపీడీఓ పులి వెంకటేశ్వర్లు మధ్యాహ్న భోజన కార్మికులకు సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం మధ్యాహ్న భోజన నిర్వాహకులతో విద్యాశాఖ, మండల పరిషత్ అధికారులు సమావేశం నిర్వహించారు. మధ్యాహ్న భోజన నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలను వివరించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన నిర్వాహకులు ఎట్టి పరిస్థితిలో అలసత్వం వహించొద్దన్నారు. ఆహార పదార్థాలు కలుషితం కాకుండా చూసుకోవాలన్నారు. తాజా కూరగాయలతో పాటు బియ్యం తదితర అన్ని వస్తువులు నాణ్యతగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. అనంతరం ఎంఈఓ పులి ఆనందం మాట్లాడుతూ.. సీఎం కప్ పోటీల్లో భాగంగా పీఈటీలు గ్రామస్థాయి పోటీలను ఈనెల 7,8 తేదీల్లో నిర్వహించి మండలస్థాయి పోటీలకు పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ రఘుపతిరెడ్డి, కాంప్లెక్స్ హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, మాధవి, రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటేశ్వర్లు

కమిటీ ఎన్నిక

సంగెం : భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ అనుబంధం) మండల కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడుగా రాజు, అధ్యక్షుడుగా సమ్మయ్య, కార్యదర్శిగా నరేశ్, కోశాధికారిగా సంపత్, తదితరులను ఎన్నుకున్నారు.

సోషల్ వెల్ఫేర్ విద్యార్థుల ప్రతిభ

శాయంపేట : హనుమకొండ జిల్లా ప్రశాంత్ నగర్‌లోని తేజస్వి హైస్కూల్‌లో గత నెల 28 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించిన జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల విద్యార్థులు వివిధ విభాగాల్లో ప్రతిభ కనబర్చి బహుమతులు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రజని తెలిపారు. ఎం. చైతన్య వెస్ట్ మేనేజ్మెంట్ అంశంలో మొదటి బహుమతి, జి.మాళవిక రిసోర్స్ మేనేజ్మెంట్ అంశంలో మొదటి బహుమతి, బి.శ్రీహర్ష ఫుడ్ హెల్త్ అండ్ ఐజీనిక్ అంశంలో మూడో బహుమతి సాధించినట్లు తెలిపారు. ఉపన్యాస పోటీలు, డ్రాయింగ్ పోటీల్లో డి. సహస్రవి మొదటి బహుమతి, బి.తిరుమల కన్సోలేషన్ బహుమతి అందుకున్నట్లు తెలిపారు. అలాగే ప్రజాపాలన- ప్రజా విజయోత్సవాల్లో భాగంగా శాయంపేట మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో పి.రచన మొదటి బహుమతి, జె.అక్షిత మూడో బహుమతి సాధించినట్లు తెలిపారు. గైడ్ టీచర్లు గీత, రాధిక, కల్పన, సరిత, మౌనికతో పాటు విద్యార్థులను ఎంఈఓ భిక్షపతి, ప్రిన్సిపాల్ రజని, ఉపాధ్యాయులు సిబ్బంది అభినందించారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ




శ్రావ్య



కీర్తన

ఆత్మకూరు : నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో నవంబర్ 29, 30 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. తొమ్మిదో తరగతి విద్యార్థినులు పి.శ్రావ్య, ఎం. కీర్తన జిల్లా తరపున పోటీల్లో పాల్గొని తృతీయస్థానంలో నిలిచారు. వీరిని ప్రధానోపాధ్యాయురాలు నిర్మలకుమారి, వ్యాయామ ఉపాధ్యాయురాలు గ్రేసమ్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థికి అభినందన



పరకాల : ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని నందిని ప్రథమ బహుమతి సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు మధు తెలిపారు. ఈ మేరకు సోమవారం విద్యార్థినిని అభినందించి జ్ఞాపిక అందించారు.

ఇన్సూరెన్స్‌ను వినియోగించుకోవాలి

శాయంపేట : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అందిస్తున్న ఇన్సూరెన్స్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ బ్రాంచ్ మేనేజర్ రాజేష్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. మెగా ఇన్సూరెన్స్ డేను పురస్కరించుకుని ఖాతాదారులు సంవత్సరానికి రూ. 1,000 ప్రీమియం చెల్లిస్తే ప్రమాదవశాత్తు మరణం సంభవిస్తే నామినీకి రూ. 20లక్షల బీమా వర్తిస్తుందని తెలిపారు.

ప్లింత్‌భీమ్ తొలగింపు



ఐనవోలు : మండలంలోని పున్నేలు గ్రామంలో గల బాబాయికుంట వద్ద నిబంధనలకు విరుద్ధంగా బఫర్ జోన్‌లో ఓ రియల్టర్ గతంలో కాంపౌండ్‌వాల్ నిర్మించాడు. గతంలో పత్రికా కథనాలు రాగా అప్పటి అధికారులు ప్రహరీగోడను తొలిగించారు. అయితే ప్లింత్‌భీమ్ అలాగే ఉండి పోయింది. గుర్తించిన ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సోమవారం తొలగించారు. ఇరిగేషన్ డీఈ శంకర్, తహసీల్దార్ విక్రమ్‌కుమార్, ఐబీ ఏఈ ప్రశాంత్ ఉన్నారు. కాగా ఐనవోలు, పున్నేలు, సింగారం, పంథిని, వెంకటాపూర్, కక్కిరాలపల్లి తదితర గ్రామాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారులు కట్టుకాల్వలు, బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిలో భూమిని ఆక్రమించి వెంచర్లు ఏర్పాటు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి

- ఏసీపీ కిశోర్‌కుమార్



మాట్లాడుతున్న ఏసీపీ కిశోర్‌కుమార్

పరకాల : కొత్తగా విధుల్లో చేరిన కానిస్టేబుల్స్, సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని ఏసీపీ కిశోర్‌కుమార్ సూచించారు. పరకాలలోని ఏసీపీ కార్యాలయ ఆవరణలో నూతనంగా కొలువులు సాధించి విధుల్లోకి చేరిన సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీసు శాఖకు మంచి పేరు తెచ్చేలా వ్యవహరించాలని సూచించారు. ఏ సమస్యైనా చట్టపరిధిలో పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ క్రాంతికుమార్, శాయంపేట సీఐ రంజిత్‌రావు, ఎస్సైలు రమేశ్, శివకృష్ణ, ప్రమోద్, అశోక్, పరమేశ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

శాయంపేట : స్థానిక పోలీస్ స్టేషన్‌లో నూతనంగా ఎంపికై న కానిస్టేబుల్స్ సోమవారం విధుల్లో చేరారు. మహిళా ఎస్సై మనీష 30 రోజుల ట్రెనింగ్ కోసం రిపోర్ట్ చేయగా ఐదుగురు కానిస్టేబుల్స్‌తో పాటు నలుగురు మహిళా కానిస్టేబుల్స్ విధుల్లో చేరారు. వీరిలో వనం శివప్రసాద్, బండారి క్రాంతికుమార్, శ్రీశైలం, రాజు, చిలుమల్ల నవీన్, ఆసియాబేగం, సిలివేరు లుబీనా, దేవులపల్లి స్రవంతి, కీసరి అమూల్య విధుల్లో చేరగా ఎస్సై ప్రమోద్‌కుమార్, ఏఎస్సై కుమారస్వామి, హెడ్ కానిస్టేబుల్ వెంకట్రాంనాయక్, లక్ష్మణ్ అభినందించారు.

గొల్ల, కురుమలను విస్మరిస్తున్న ప్రభుత్వం

- జిల్లా సహాయ కార్యదర్శి రాజ్‌కుమార్ యాదవ్

శాయంపేట : రాష్ట్ర ప్రభుత్వం గొల్ల, కురుమలను విస్మరిస్తోందని గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రాజ్‌కుమార్ యాదవ్ ఆరోపించారు. గొల్ల, కురుమలకు రెండో విడత గొర్రెల పంపిణీ చేపట్టాలని డిమాండ్ చేస్తూ సోమవారం డిప్యూటీ తహసీల్దార్ ప్రభావతికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు రెండో విడత గొర్రెలను పంపిణీ చేస్తామని ప్రకటించి ఏడాది సమీపిస్తున్న ఇంకా అమలు చేయలేదని విమర్శించారు. 50 సంవత్సరాలు నిండిన గొర్రెల కాపర్లకు నెలకు రూ.5వేల పింఛన్ ఇవ్వాలని, రాష్ట్రంలో గొర్రెలకు, మేకలకు ప్రభుత్వం ఉచితంగా ఇన్సూరెన్స్ చేయాలని, ఎన్నికల హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. గొల్ల, కురుమలను విస్మరిస్తున్న ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ఈనెల 9వ తేదీన చేపట్టనున్న ప్రజా భవన్ ముట్టడికి గొల్ల, కురుమలు వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మండల కార్యదర్శి నర్సయ్య, సహాయ కార్యదర్శి రాజన్న పాల్గొన్నారు.



డీటీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రాష్ట్రాన్ని ఏలుతున్న అబద్ధాల ప్రభుత్వం

- బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సంపత్‌రావు

కమలాపూర్ : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అబద్ధాల పాలన కొనసాగుతోందని బీజేపీ కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పుప్పాల రఘు విమర్శించారు. బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలనను ఎండగడుతూ మండలంలోని శ్రీరాములపల్లి, అంబాల, గూడూరు, కమలాపూర్, ఉప్పల్ గ్రామాల్లో సోమవారం నిర్వహించిన బైక్ ర్యాలీలో వారు పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మొదటగా రైతులకు రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తామని ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో చేయలేదని అన్నారు. రైతు భరోసా ఇచ్చిన దాఖలాలు లేవని, కౌలు రైతులకిచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, పేద ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి కింద తులం బంగారం ఇవ్వలేదని, ఉచిత స్కూటీ ఎక్కడ ఉన్నయో చెప్పాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చేవరకు ప్రజల పక్షాన బీజేపీ పోరాడుతుందన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు కట్కూరి అశోక్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి తుమ్మ శోభన్‌బాబు, కిసాన్‌మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వర్, జిల్లా ఉపాధ్యక్షుడు అరవింద్, నాయకులు రాజేందర్, మధుసూదన్‌రెడ్డి, ఆదిరెడ్డి, రత్నాకర్, రాంబాబు, కుమారస్వామి, సంపత్, రమేశ్, సత్తయ్య, సంతోశ్, సుభాష్, రంజిత్, తిరుపతిరెడ్డి, పవన్‌కల్యాణ్, ఆకాష్, సాయికృష్ణ, సదానందం, ఓదెలు, రాజేందర్, రాజు, జయరాజ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీ చేపట్టిన బీజేపీ నాయకులు

గుడుంబా స్థావరంపై పోలీసుల దాడులు

- 1200 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం, 20 లీటర్ల గుడుంబా స్వాధీనం

పరకాల : మున్సిపాలిటీ పరిధిలోని రాజిపేట శివారులో గల చిన్నేరుకుంట సమీపంలో ఏర్పరుకున్న గుడుంబా స్థావరంపై పరకాల పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. ఎస్సై శివకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడుల్లో.. 8 డ్రమ్ముల్లో నిల్వచేసిన 12 వందల లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు ఎస్సై తెలిపారు. అక్కడే రవాణాకు సిద్ధంగా ఉన్న 20 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. పోలీస్‌లను చూసి గుడుంబా స్థావరం నుంచి వ్యక్తి పరారైనట్లు తెలిపారు. అతడిని అల్లె రాజుగా గుర్తించి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ నిషేధిత గుడుంబాను తయారీ చేసినా, అమ్మినా కఠిన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. ఈ దాడుల్లో కానిస్టేబుల్స్ సుధాకర్, రాజసమ్మయ్య, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న బెల్లం పానకం, గుడుంబా

ఆలయాల నిర్మాణానికి స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ఈఓ, తదితరులు

ఐనవోలు: మండల కేంద్రంలోని ఊరగుట్టపై ఆలయాల నిర్మాణాలకు ఎండోమెంట్ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఈ మేరకు సోమవారం ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు, అర్చకులు ఊరగుట్టను సందర్శించారు. గుట్టపై మల్లన్న గుడి ఆనవాళ్లు ఉండగా అక్కడే శివయ్య ఆలయం పునఃనిర్మాణం, గుట్ట దిగువన సమాంతరంగా ఉండే ప్రాంతంలో కొండ పోచమ్మ ఆలయ నిర్మాణాలు చేపట్టాలని కొంతకాలంగా భావిస్తున్నారు. అందులో భాగంగా స్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు.